క్లుప్తంగా

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ విలియమ్స్

సారవకోట: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని డిప్యూటీ ఈఓ విలియమ్స్ సూచించారు. మండలంలోని చిన్నకిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో పాఠశాలలో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓలు ఎం.వి.రమణ, భూలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డుల పంపిణీ



సీసీఆర్సీ కార్డులు అందజేస్తున్న ఏఓ సంధ్య

హిరమండలం: మండలంలోని కౌలు రైతులందరూ విధిగా సాగుహక్కు పత్రాలు కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అన్నారు. హిరమండలం రైతు సేవా కేంద్రంలో మంగళవారం కౌలు రైతుల గుర్తింపు సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ కౌలు రైతులందరికీ వీఆర్వోల ద్వారా గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. పాతవారు సీసీఆర్సీ పత్రాలను రెన్యువల్ చేసుకోవాలని, కొత్తవారికి అర్హత మేరకు కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఈ పత్రాలతో భూ యజమానులకు ఎలాంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు. తొమ్మిది నెలలపాటు ఈ గుర్తింపు కార్డులు వినియోగించుకోవచ్చునన్నారు. గ్రామ పెద్దలు వ్యవసాయశాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మూగజీవాలకు టీకాలు



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

బూర్జ: మండలంలోని నీలాదేవిపురంలో బూర్జ పశువైద్యశాఖాధికారి ఎం.జ్యోత్స్న ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు మంగళవారం టీకాలు వేశారు. మూగజీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులపై పలు సూచనలు, సలహాలు అందజేశారు.

ఘనంగా ఆవేటి వారాలు



కొత్తూరులో ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కొత్తూరు: కొత్తూరు, కుంటిభద్రతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆవేటి వారాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు ముర్రాటలతో చల్లదనం చేసి మొక్కులు చెల్లించారు. ప్రతి ఏటా ఖరీఫ్ దమ్ములు చేసే ముందు ఆవేటి వారాలు చేయడం ఆనవాయితీగా వస్తుందని ఆయా గ్రామాల రైతులు తెలిపారు.

తామరాపల్లి వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాలి



ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నరసన్నపేట: మండలంలోని తామరాపల్లి వద్ద జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు బోర తవిటయ్య తదితరులు కేంద్ర పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు శ్రీకాకుళంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. వంతెన లేకపోవడంతో రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎల్.ఎన్.పేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఎంకె మిశ్రో అన్నారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో పిచ్చి మొక్కలను మంగళవారం తొలగించారు. మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో మన పరిసరాలను, వీధులను అంతే శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ప్రత్యేక పూజలు



ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాతపట్నం గ్రామ దేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆషాఢ మాసం కావడంతో అమ్మవారి ఆలయానికి తెల్లవారు జామునుంచే స్థానికులతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు వాహన పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశామని ఈఓ వాసుదేవరావు తెలిపారు.

- పాతపట్నం

● పూడికతీత పనుల పరిశీలన



వంశధార కుడి ప్రధాన కాలువలోని గుర్రపు డెక్క, పూడికతీతల పనులను పాతహిరమండలం వద్ద వంశధార ఎస్ఈ బి.రాంబాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు ముందుగా కాలువలోని గుర్రపు డెక్క, పూడికతీత పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. 0 నుంచి 15 కిలో మీటర్ల వరకు 8 పనులను కలెక్టర్ నిధుల నుంచి రూ.5 లక్షలతో ఈ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

- హిరమండలం

● పశువులకు వ్యాక్సిన్లు



ఎల్.ఎన్.పేట మండలంలోని కొమ్ముగవలస గ్రామంలో మంగళవారం పాడి పశువులకు వ్యాధి నిరోధక టీకాలను గ్రామ సచివాలయ పశువైద్య సిబ్బంది వేశారు. వర్షాకాలంలో పశువుల్లో అనేక వ్యాధులు వ్యాపిస్తాయని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే పశువులకు నష్టం జరుగుతుందన్నారు. గ్రామ సచివాలయ పశు వైద్య సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కుంచాల అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

- ఎల్.ఎన్.పేట

వంట ఏజెన్సీలను..
ఏ ప్రాతిపదికన మార్చుతున్నారు?

● అధికారులను ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు



మాట్లాడున్న ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి

నరసన్నపేట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ మహిళలను ఇష్టానుసారంగా మార్చవద్దని, తప్పులు చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీంట్లో విద్యా పద్దుపై ఎంఈఓ దాలినాయుడు మాట్లాడుతుండగా.. ఎంపీపీ జోక్యం చేసుకుని మండలంలో కొందరు వంట మహిళలను మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు, ఏ ప్రాతిపదికన మార్చుతున్నారు అని ప్రశ్నించారు. ఇష్టానుసారంగా మార్చడం సరి కాదని అన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ అలా ఎక్కడా మార్చలేదని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నెలకో సంఘం వంట చేసేందుకు వారే ముందుకు వచ్చారని వివరించారు.

వ్యవసాయ పద్దుపై చర్చలో కౌలు రైతుల కార్డులు పొందాలంటే నోటరీ అడుగుతున్నారని, ఇది ఎలా అని ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి డీటీ శరత్ సమాధానమిస్తూ.. కచ్చితంగా నోటరీ అడగటం లేదని, ఉంటే ఇవ్వమంటున్నామని, దీనిని రైతులు గమనించాలని కోరారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళ, శుక్ర వారాల్లో డ్రై డే పాటించాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. దీనికి ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని, ఎమ్మెల్సీ నర్తు రామారావును మండల పరిషత్ తరఫున ఎంపీపీ సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేద్దామన్నారు. తాగు, సాగు నీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. విద్య ప్రమాణాలు పెరగాలని, వైద్యం పేదలకు అందించాలని కోరారు. ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఒకోసారి ఒక్కో పార్టీ అధికారంలో ఉంటుందని, కానీ అధికారులుగా మీరే ఉంటారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, వైస్ ఎంపీపీలు చింతల సత్యవతి, పాగోటి జయలక్ష్మి, తహసీల్దార్ కనకారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ప్రత్యేకాధికారులు



చంగుడిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

పాతపట్నం: పాతపట్నం మండలంలోని 34 గ్రామ పంచాయతీలకు పారిశుద్ధ్యం, విష జ్వరాలు, డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల నిమిత్తం మండల స్థాయి అధికారులను పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించామని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు తెలిపారు. చంగుడి గ్రామ సచివాలయాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంగుడి, సరాలి, దశరథీపురం పంచాయతీలకు ప్రత్యేకాధికారిగా ఎంపీడీఓ ఉంటారన్నారు. కొరసవాడ, కాగువాడ పంచాయతీలకు తహసీల్దార్ ప్రసాదరావు, తీమర, తామర, సీధి పంచాయతీలకు ఈఓపీఆర్డీ కృష్ణారావు, రొంపివలస, ఆర్.ఎల్.పురం ఎంఈఓ-1 బి.శ్రీధర్, సీతారాంపల్లి, రంకిణి పంచాయతీలకు ఎంఈఓ-2 తిరుమలరావు పనిచేస్తారన్నారు. రొమదల, పాశీగంగుపేట పంచాయతీలకు మండల ఇంజినీరు టి.ప్రసాదరావు, పాతపట్నం, బొరుభద్ర పంచాయతీలకు ఆర్‌డబ్ల్యూ జేఈ వి.కల్యాణ్ రామ్, శోభ, పెద్దసున్నాపురం పంచాయతీలకు ఏఓ రవి కుమార్, తిడ్డిమి, కొదూరు, బూరగాం పంచాయతీలకు ఆర్‌అండ్‌బీ జేఈ బి.గోపాలరావు, ఎ.ఎస్.కవిటి, చాకిపల్లి, ఎస్.ఎస్.మనుగు పంచాయతీలకు సీడీపీఓ విమలకుమారి, తెంబూరు, పెద్దనరియాపల్లి, పెద్దలక్ష్మీపురం పంచాయతీలకు ఏపీఎం మనోరత్నం, గంగువాడ, పెద్దమల్లిపురం, చిన్నమల్లిపురం, బడ్డుమర్రి పంచాయతీలకు ఏపీఓ సురేష్, సింగుపురం, పెద్దలోగిడి, గురండి పంచాయతీలకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమరావతిని నియమించారు.

నేడు, రేపు తీర ప్రాంతంలో గస్తీ



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

పోలాకి: జిల్లాలో బుధ, గురువారాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తీర ప్రాంత గస్తీ (కోస్టల్ ఎక్సర్‌సైజ్) నిర్వహించనున్నారు. అన్ని తీరప్రాంత మండలాల పరిధిలోని పోలీస్ స్టేషన్‌లకు సిబ్బంది మంగళవారం సాయంత్రమే చేరుకున్నారు. మెరైన్ పోలీసులతో సంయుక్తంగా నిర్వహించనున్న ఈ గస్తీలో తీరప్రాంతంలో ఎప్పటికప్పుడు జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలించటం, సముద్రం ద్వారా సంఘ విద్రోహశక్తుల చొరబాట్లను ఎలా గుర్తించాలనే అంశాలపై స్థానికులకు అవగాహన కల్పిస్తారు. చెక్ పోస్టుల వద్ద రెండురోజుల పాటు గస్తీలో పాల్గొని వాహన తనిఖీలు నిర్వహిస్తారు. ఇందుభాగంగా మరిన్ని ఇంటర్నల్ టార్గెట్స్‌ను గుర్తించాల్సి ఉంటుందని పోలాకి ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

సీఎఫ్‌ను మార్చొద్దు..



మాట్లాడుతున్న గ్రామస్తులు

నరసన్నపేట: మాకు నచ్చిన వాళ్లనే ఉంచండి, మీకు నచ్చిన వాళ్లకు తీసుకువచ్చి మాపై రుద్దకండి, మా అందరికీ ఇష్టమైన సీఎఫ్ ఆరి అన్నపూర్ణను ఎందుకు తొలగిస్తారు?. ఆమెనే కొనసాగించండి అని సారవకోట మండలం నవతలకు చెందిన మహిళలు డిమాండ్ చేశారు. తమ గ్రామానికి చెందిన సీఎఫ్ అన్నపూర్ణను తొలగిస్తున్నట్లు తెలుసుకున్న 30 మంది మహిళలు మంగళవారం నరసన్నపేట టీడీపీ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిశారు. వారి సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ అన్నపూర్ణను తొలగించ వద్దని, దీనికేనా మీకు ఓట్లు వేశామా అని నిలదీశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించేందుకు కూడా చూస్తున్నారన్నారు. మా అందరికీ సమ్మతమైన సీఎఫ్‌ను మార్చుతామంటున్నారు, అంతా మీ ఇష్టమేనా అని మండిపడ్డారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

హిరమండలం: మండలంలోని ఎం.అవలంగి, కొత్తపేట ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ కె.రాంబాబు మంగళవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని, రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఎం.అవలంగిలో రాగిమాల్ట్‌ను విద్యార్థులతో కలిసి తాగి రుచి చూశారు. మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు.

ఇసుక పాలసీని పారదర్శకంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: నూతన ఇసుక విధానాన్ని ప్రభుత్వం ప్రకటించిందని, దీని ప్రకారం నాణ్యమైన ఇసుకను పాదర్శకంగా వినియోగదారులకు అందిస్తామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఇసుక అక్రమంగా తరలించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాన్స్‌పోర్ట్, సీనరేజ్ చార్జీస్‌తోనే ఇసుక వినియోగదారులకు అందాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఈ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఆమదాలవలస: పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు అన్నారు. మండలంలోని నెల్లిపర్తి గ్రామంలో మంగళవారం పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా లేకపోతే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కాలువల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. వీఆర్వో కృష్ణ, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



హిరమండలం: గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యులు

నరసన్నపేట: గర్భిణులు విధిగా ఆహార నియమాలు పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని నరసన్నపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జయశ్రీ అన్నారు. ఆస్పత్రిలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ యోజన పథకంలో భాగంగా మంగళవారం 40 మంది గర్భిణులకు తనిఖీలు చేశారు. ఉర్లాం పీహెచ్‌సీలో 20 మందికి డాక్టర్ సుజాత తనిఖీలు చేశారు. మాకివలస పీహెచ్‌సీలో 15 మంది గర్భిణులకు డాక్టర్ శిరీష తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు.

హిరమండలం: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులు సాయి గీత, ఫరుక్‌హుస్సేన్ ఆధ్వర్యంలో పీఎంఎంఎస్‌వైలో భాగంగా 78 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 17 మంది హైరిస్క్ గర్భిణులుగా గుర్తించారు. వీరు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అవసరమైన వారందరికీ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులకు సత్యసాయి భక్తుల ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. జెమ్స్ ఆస్పత్రి వైద్యులు ప్రమీల, మౌనిక, రోజారమణి, మోహిని, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సారవకోట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల కోసం వచ్చిన గర్భిణులకు సారవకోట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అక్కులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కూన మీనాకుమారి అన్నారు. అక్కులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గర్భిణులు, వారి సహాయకులకు రణస్థలం మండలం పాతర్లపల్లికి చెందిన నేతల కృష్ణ, రేవతి దంపతులు భోజన ఏర్పాట్లు చేశారు. సత్యసాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, జిల్లా జాయింట్ యూత్ కోఆర్డినేటర్ సాయికృష్ణ, జోనల్ యూత్ ఇన్‌చార్జి పవన్, సమితి యూత్ ఇన్‌చార్జి షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

హిరమండలం: ఉపాధి హామీ పథకం సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలని డ్వామా పీడీ జీవి చిట్టిరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్నారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలో ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులతో పాటు ఐటీడీఏ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ, డబ్ల్యూఆర్ తదితర శాఖల ద్వారా సుమారు రూ.12.62 కోట్ల ఖర్చుతో 711 పనులు చేశారన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో సమాజిక తనిఖీ బృందం సభ్యులు గత నెల 27 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారన్నారు. ఈ తనిఖీల్లో గుర్తించిన అంశాలను సామాజిక ప్రజావేదిక ద్వారా డీఆర్పీలు చదివి వినిపించారు. పలు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగాయని, కొలతల్లో తేడాలు ఉన్నాయని వివరించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేవని, మస్టర్లలో దిద్దుబాట్లు, కొట్టివేతలు గుర్తించారు. తంప గ్రామంలో 13 మంది వేతనదారులు 40 రోజులపాటు పనులు చేపడితే ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంతో ఏడాదైనా వేతనాలు అందలేదని సామాజిక తనిఖీలో గుర్తించినట్లు డీఆర్పీ తెలిపారు.

ఉపాధి సిబ్బందిపై డ్వామా పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు ఇలాగే ఉంటే సస్పెండ్ చేస్తానిమని హెచ్చరించారు. డీవీఓ లవరాజు, ఏపీడీ రాధ, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, ఎస్ఆర్పీ తిరుపతిరావు, ఏపీఓ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పాగిరి బుచ్చిబాబు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు టి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మెళియాపుట్టి: వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని, పంచాయతీ, పాఠశాలల సిబ్బంది మురుగు నీటి నిల్వలు లేకుండా చూడాలని ఎంపీడీఓ భాస్కరరావు అన్నారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం, చాపర, కొసమాల పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలల పరిసరాల్లో చెత్తాచెదారాలు లేకుండా చూడాలన్నారు. ప్రతీ సోమవారం పాఠశాలలో డ్రై డే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. చాపర, మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో ఆయా పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత, తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. వైద్యులు పావని, గ్రీష్మ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

కొత్తూరు: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని కౌశల్యాపురం పాఠశాల విద్యార్థులకు మంగళవారం యూనిఫాం అందించారు.

సర్పంచ్ గోవిందరావు, వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొట్నూరు జగన్ మృతికి సంతాపం



పొట్నూరు జగన్ (ఫైల్)



జగన్ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: స్థానిక పెద్దపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, కళింగ కోమట్ల సంఘం గౌరవ అధ్యక్షుడు పొట్నూరు జగన్ మంగళవారం వేకువ జామున అనారోగ్యంతో మృతి చెందారు. జగన్ మృతి చెందిన విషయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ తెలుసుకున్నారు. పెద్దపేటలోని జగన్ ఇంటికి వెళ్లి సంతాపం తెలిపారు. మంచి స్నేహితుడు, పార్టీ సీనియర్ నాయకుడిని కోల్పోయామన్నారు. జగన్ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి జగన్ కొనసాగుతూ స్థానికంగా పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. నరసన్నపేటలో కళింగ కోమట్ల సంఘం పటిష్టతకు కృషి చేశారు. నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా పనిచేశారు. జగన్ మృతికి కళింగ కోమట్ల సంఘం ప్రతినిధులు తంగుడు జోగారావు, కేసీహెచ్‌బీ గుప్త, పొట్నూరు కృష్ణ ప్రసాద్, పొట్నూరు సాయి ప్రసాద్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వారాహ, కూర్మావతారాల్లో జగన్నాథుడు



నరసన్నపేట: వేంకటేశ్వరాలయంలో కూర్మావతారంలో జగన్నాథ స్వామి

సారవకోట: మండలంలోని అవలింగి గ్రామంలోని జగన్నాథ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న రథ యాత్రలో భాగంగా స్వామివారిని మంగళవారం వారాహావతారంలో అలంకరించారు. స్థానిక గుండిచా మందిరంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు.

నరసన్నపేట: జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక వేంకటేశ్వరాలయంలో జగన్నాథ స్వామి కూర్మావతారంలో మంగళవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్దపేట కూడలి వద్ద కూడా జగన్నాథ స్వామి యాత్రకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. లకిమేర ఉమారామలింగేశ్వరాలయంలో జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

పాతపట్నం: స్థానిక బ్రాహ్మణవీధిలోని జగన్నాథస్వామి మంగళవారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రథయాత్ర ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.